క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: మండలంలోని కోటపాడు శ్రీ చెన్నకేశవ, వీరభద్ర స్వామి ఆలయాలకు నూతన ధర్మకర్త మండలి నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ వేణునాథరెడ్డి సోమవారం తెలిపారు. 30 ఏళ్ల వయస్సు పూర్తయిన వారు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ లోపు నంద్యాల రైతు నగరంలోని జిల్లా దేవదాయ ధర్మదాయ కార్యాలయ అధికారికి పంపాలని సూచించారు. వివరాలకు సెల్ 8333811586, 9491633491 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జన ఔషధిని వినియోగించుకోండి


ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దొర్నిపాడు: జన ఔషధిలో మందుల ధరలు బహిరంగ మార్కెట్‌తో పోల్చుకుంటే తక్కువగా ఉంటాయని, ఇది జిల్లాలోనే మొదటిదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం గుండుపాపల సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం చైర్మన్ బాలవెంకటరెడ్డి అధ్యక్షతన జనఔషధి కేంద్రం సీఈఓ సుబ్బారావుతో కలిసి ప్రారంభించారు.కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ శివలీల, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, కోవెలకుంట్ల కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, సబ్‌డివిజినల్ సహకార అధికారి లక్ష్మీనారాయణ, రిటైర్డ్ డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఉయ్యాలవాడ :ఆర్.పాంపల్లె గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సాదిక్‌బాషా నుంచి 15 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామాజంనేయరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామం చివరలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు మండల మీట్

దొర్నిపాడు: ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీడీఓ

దొర్నిపాడు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మండల క్రీడాకారులు పలు క్రీడల్లో సత్తాచాటారు. జిల్లా స్థాయిలో జరిగిన మహిళా క్రికెట్ పోటీల్లో కొండాపురం జట్టు ద్వితీయ స్థానం సాధించిందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే నియోజకవర్గం స్థాయి కబడ్డీ, క్రికెట్ పురుషుల ప్రథమస్థానంలో, క్రికెట్‌లో మహిళలు కూడా ఫస్ట్ ప్లేస్‌లో వచ్చారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పురుషులు, మహిళలు ద్వితీయ స్థానం, పురుషుల వాలీబాల్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. వీరిని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అభినందించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పీడీలు దేవేంద్ర, శ్రీధర్, బాలకృష్ణ, సరళ, మండల కోఆర్డినేటర్ జర్మియా పాల్గొన్నారు.

89.50 శాతం కులగణన పూర్తి


దేవనగర్‌లో సర్వే చేస్తున్న వలంటీర్ చంద్ర

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో 89.50 శాతం కులగణన సర్వే పూర్తయిందని డీఎల్‌డీఓ మురళీకల్యాణి సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు 5,33,783 గృహాలకు సంబంధించిన 14,57,756 మందికి సంబంధించిన కులగణన సర్వే పూర్తయ్యిందని చెప్పారు.

భవన కార్మికుల సంక్షేమానికి సెస్ జమ చేయాలి

నంద్యాల: పబ్లిక్ వర్క్స్, మున్సిపాలిటీ, లోకల్ బాడీస్, ప్లాన్ అప్రూవల్ అథారిటీస్, ఎంపీడీఓ, ప్రభుత్వ రంగ సంస్థలు విధిగా ఒక శాతం లేబర్ సెస్‌ను ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కార్మికుల సంక్షేమ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ, ఇతర నిర్మాణాలకు సంబంధించిన వ్యయంలో ఒక శాతం సెస్‌ను ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను సూచించారు. అలాగే ప్రతి నెల ఒక శాతం సెస్‌కు సంబంధించిన వివరాలను కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు పంపాలన్నారు. సంయుక్త కార్మిక కమిషనర్ ఎం.బాలు నాయక్, ఉప కార్మిక కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ కార్మిక కమిషనర్ బషీరున్నిసా బేగం పాల్గొన్నారు.

జొన్న పంట పండింది

- ఆశించిన మేర దిగుబడి
- వర్షాభావ పరిస్థితుల్లోనూ అనుకూలించిన వాతావరణం
- సాధారణ విస్తీర్ణం కంటే అధికంగా సాగు
- మద్దతు ధర కల్పించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


చాబోలు సమీపంలో జొన్నలు ఆరబోసిన దృశ్యం


జిల్లెల్ల వద్ద మిషన్‌తో కోత కోస్తున్న దృశ్యం

గోస్పాడు: వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులకు ఈ ఏడాది వాతావరణం అనుకూలించింది. ఖరీఫ్, రబీలో భాగంగా సాగు చేసిన పంటలన్నీ దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. అలాగే వాటికి తగ్గట్టుగా గిట్టుబాటు ధర ఉంటుండటంతో మంచి లాభాలు గడించారు. పంటలకు సరైన సమయంలో వర్షం కురవకపోవడంతో ప్రభుత్వం కాల్వల ద్వారా సాగు నీరు అందించింది. దీంతో వరి, మొక్కజొన్న, మినుము, పత్తి, మిర్చి వంటి పంటలన్నీ అధిక దిగుబడులు లభించాయి. ఖరీఫ్ పంటలు ముగిసిన వెంటనే కొందరు కేసీ కాల్వకు నీరు విడుదలపై అనుమాలుండటంతో వరికి ప్రత్యామ్నాయంగా జొన్న పాట సాగు చేశారు. ప్రస్తుతం కోతలు జోరుగా సాగుతున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ విస్తీర్ణానికి మించి సాగు..

రబీ సీజన్‌లో జొన్న సాధారణ విస్తీర్ణం 2,808 హెక్టార్లు కాగా 4,040 హెక్టార్ల వరకు సాగైంది. సీజన్ ప్రారంభంలోనే మండలంలోని కానాలపల్లె, ఎం. చింతకుంట్ల, జూలేపల్లి, గోస్పాడు, పసురపాడు, బీవీ నగర్, శ్రీనివాసపురం, సత్యనారాయణపురం, శ్రీరాంనగర్, ఒంటివెలగల తదితర గ్రామాల పరిధిలో రైతులు జొన్న పంట సాగు చేశారు. ప్రభుత్వం కాల్వల ద్వారా విడతలుగా సాగు నీరు అందించింది. సరైన నీటి తడులు అందడంతో పంట విరగ్గాసింది. ఇక ఈ ఏడాది చీడపీడలు అంతంత మాత్రంగానే ఉండటంతో కొంత మేర ఖర్చులు తగ్గాయి.

లాభాల బాట..

జొన్నపంట రైతులకు లాభసాటిగా మారింది .ధర ఉంటే దిగుబడి రాక, దిగుబడి వచ్చిన సమయంలో ధర లేకపోవడంతో గతంలో నష్టాలు చవిచూశారు. అయితే ఈ ఏడాది దిగుబడి, ధర బాగుండటంతో లాభాల బాట పట్టారు. పంట కోత దశకు చేరుకోవడంతో కొద్ది రోజులుగా కూలీలు, యంత్రాల సాయంలో పంటను కోసి ఆరుబయట, కల్లాల్లో ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ప్రస్తుతం ఎకరాకు 16–20 క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తోంది. శ్రమకు తగ్గ ఫలితం దక్కిందని కష్టజీవులు సంబర పడుతున్నారు.

మద్దతు ధర..

పంటకు ప్రభుత్వం మార్కెట్ ధర కంటే అధికంగా మద్దతు ధర కల్పించింది. ప్రస్తుతం క్వింటా ధర మార్కెట్లో గింజ నాణ్యతను బట్టి రూ.2500 నుంచి రూ.2,800 వరకు పలుకుతోంది. ప్రభుత్వం రైతుల కష్టాన్ని గుర్తించి క్వింటాలుకు రూ.3180 ప్రకారం ధర నిర్ణయించింది. కాగా పంట సాగుకు ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ.24 వేల దాకా వెచ్చించారు. పెట్టుబడి పోనూ బాగానే మిగులుతోందని పేర్కొంటున్నారు.

దిగుబడి బాగుంది



ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని జొన్న పంట సాగు చేశా. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగా కురవడంతో కరువు తప్పదనుకున్నాం. అలాంటి సమయంలో ప్రభుత్వం స్పందించి కాల్వల ద్వారా సాగు నీరు విడుదల చేయించింది. వాతావరణం అనుకూలించడంతో పాటు పైరుకు తెగుళ్ల బెడద లేకపోవడంతో కొంతమేరకు ఇబ్బందులు తప్పాయి. ఎకరాకు 18 నుంచి 20 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. మార్కెట్లో ధర కూడా బాగుంది.

– సుబ్బరాయుడు, రైతు, దీబగుంట్ల


చింతకుంట వద్ద జొన్నపైరు కోత కోస్తున్న కూలీలు

మద్దతు ధర కల్పించారు



ఈ ఏడాది జొన్న దిగుబడులు బాగుండటంతో పాటు ప్రభుత్వం మద్దతు ధర కల్పించింది. క్వింటా రూ.3,180 మద్దతు ధర ఇస్తుంది. బయటి మార్కెట్లో క్వింటా ధర రూ.2800కు మించి కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం అధికంగా ధర చెల్లిస్తుండటంతో ఈ సారి పంట లాభసాటిగా మారింది.

– గద్దం ప్రసాదయాదవ్, రైతు, పసురపాడు

ఆధ్యాత్మిక చింతనతో మనసుకు ప్రశాంతత


సాధువులకు దస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ రమేష్‌బాబు

ఆళ్లగడ్డ: ఆధునిక సమాజంలో ఆధ్యాత్మిక చింతనతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని ఆళ్లగడ్డ పట్టణ సీఐ రమేష్‌బాబు అన్నారు. అహోబిలేశుడి ఉత్సవ పల్లకీ స్థానిక గంగమ్మ దేవాలయం సమీపంలోని తెలుపుపై కొలువైన సందర్భంగా సోమవారం ఫొటోగ్రాఫర్ సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై.. ఉత్సవ పల్లకీ వెంట నడుస్తున్న యాచకులు, సాధువులకు విందు భోజనం ఏర్పాటు చేసి అవసరమైన వారికి దుస్తులు, దుప్పట్లను సీఐ చేతుల మీదుగా పంపిణీ చేశారు. దాతలను సీఐ అభినందించారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తదితరులున్నారు.

88 మంది రిజిస్ట్రేషన్లు పూర్తి

నంద్యాల(అర్బన్): కానాల గ్రామంలో 88 మంది ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తయిందని వీఆర్‌ఓ ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర తెలిపారు. స్థానిక సచివాలయంలో సోమవారం నిర్వహించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో నాలుగు లేఅవుట్లలో 189 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా సోమవారం 88 మంది స్థలాలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని, లబ్ధిదారులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో సచివాలయానికి వస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. వీఆర్‌ఓ శివయ్య ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు


నూతన తహసీల్దార్ నాగరాజు

దొర్నిపాడు: తహసీల్దార్‌గా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం జిల్లా తాడిమర్రి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన విధుల్లో చేరిన తరువాత వీఆర్‌ఓలు నాగేష్, రాధమ్మ, సావిత్రి, మురళీ మోహన్, సీనియర్ అసిస్టెంట్ మాధవీ, జూనియర్ అసిస్టెంట్ చిన్న గోవిందు మర్యాద పూర్వకంగా కలిశారు.


ఉయ్యాలవాడలో వెంకటరమణ

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రవికుమార్ వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ బదిలీపై వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ, ఆర్‌ఐ సత్తార్, సీనియర్ అసిస్టెంట్ అంకన్న, వీఆర్‌ఓలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.


గోస్పాడులో భార్గవి

గోస్పాడు: తహసీల్దార్‌గా భార్గవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ విజయశేఖర్ విధులు నిర్వహించేవారు. తిరుపతి జిల్లా డీఎస్ కండ్రిగా మండలం తహసీల్దార్ భార్గవిని ఇక్కడికి బదిలీ చేశారు. డీటీలు విజయశేఖర్, రామచంద్రారావు, సీనియర్ అసిస్టెంట్ రాము, సిబ్బంది స్వాగతం పలికారు.


బాధ్యతలు చేపట్టిన మురళీమోహన్

రుద్రవరం: తహసీల్దార్‌గా మురళీమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను అధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఇంత వరకు ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రప్రసాద్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు.


తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నగరిలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నంద్యాలలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే ఎంపీడీఓగా సౌభాగ్యమ్మ సోమవారం విధుల్లో చేరారు. నంద్యాల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సుగుణశ్రీ వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు.


ఎంపీడీఓ సౌభాగ్యమ్మ


చాగలమర్రిలో వెంకటరవణమ్మ

చాగలమర్రి: వైఎస్సార్ జిల్లా, బద్వేలు ఆర్‌డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న వెంకట రవణమ్మను చాగలమర్రి తహసీల్దార్‌గా నియమించడంతో ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్క పని చేస్తున్న సుభద్రమ్మను చిత్తూరు జిల్లా, బంగారు పాళెం మండలానికి బదిలి చేశారు.

కబ్జాదారులెవరో ప్రజలకు తెలుసు


ఆధారాలు చూపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆళ్లగడ్డ: ఈ ప్రాంతంలో ఎవరు కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసనని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గొట్లూరు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముస్లింలకు సంబంధించిన స్థలాన్ని ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు కబ్జా చేశాడని మాజీ మంత్రి అఖిలప్రియ ఆరోపించిందన్నారు. నిజాలు తెలుసుకోకుండా ఎవరో చెప్పిన మాటలు విని తమపై ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆ స్థలం అఖిలప్రియ తాత మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి రిజిస్టర్ చేయించి ఇచ్చిన క్రిష్ణవేణి అనే ఆమె నుంచి కొనుక్కొని రిజిస్టర్ చేయించుకున్నారని చెప్పారు. అయినా మా పార్టీకి చెందిన వ్యక్తి తనకు అందులో హక్కు ఉందని వస్తే మానవతా దృక్పథంతో ఎమ్మెల్యే సూచన మేరకు అతనికి కూడా వాటా ఇచ్చారని తెలిపారు. దీన్ని ముస్లింలకు అన్యాయం చేశారని మాటమార్చి చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేయాలనుకోవడంతో సరికాదన్నారు. మీ దగ్గర ఆధారాలుంటే మీడియాకు చూపించి మాట్లాడాలని సవాల్ విసిరారు. రుద్రవరం ముస్లిం కుటుంబాలు మీ దగ్గరకు పంచాయితీకి వస్తే వారిని కొట్టి లక్షల రూపాయలు లాక్కొని పంపించారని, నియోజకవర్గంలో చర్చ సాగుతోందని, అది నిజమో కాదో వారితోనే మాట్లాడించాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు


కుళాయి కనెక్షన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలో పారిశుద్ధ్య పనులపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన పారిశుద్ధ్య వారోత్సవాలను చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసాతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దష్టి సారిస్తామని చెప్పారు. కాల్వల్లో పూడిక తొలగించి, ఫాగ్గింగ్, స్ప్రేయింగ్ పనులను పరిశీలించారు.

విధుల్లో అలసత్వం చూపిన అమెనిటీస్ సెక్రటరీ సస్పెన్షన్

ఇటీవల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తనిఖీల్లో భాగంగా విద్యా నగర్ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న అమెనిటీస్ సెక్రెటరీ ఉమామహేశ్వర రెడ్డి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండటంపై సస్పెన్షన్ చేశారు. 7నెలలుగా మంచి నీటి కుళాయి లీకేజీని గుర్తించకపోగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సెక్రెటరీ పై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చర్యలు చేపట్టారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ



ఎస్పీ రఘువీర్ రెడ్డిని కలిసిన డీఎస్పీ రాజేంద్రనాథ్‌రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని నంద్యాల డీఎస్పీ రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యసాయి జిల్లా క్రైం బ్రాంచ్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రాజేంద్రనాథ్‌రెడ్డికి ఉన్నతాధికారులు డీఎస్పీగా పదోన్నతి కల్పించారు. అలాగే కోవెలకుంట్ల సీఐ జయచంద్రారెడ్డి, కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్ రెడ్డి, రేవనూరు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి విధుల్లో చేరి ఎస్పీని కలిశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని 15వ వార్డులో కౌన్సిలర్ సన్నాల అనూష, జేసీఎస్ పట్టణ అధ్యక్షుడు సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాల్గో విడత ఆసరా సంబరాల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ నాలుగు విడతల్లో మహిళల రుణాలను మాఫీ చేశారని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ హనుమంత నాయక్

ఆళ్లగడ్డ: అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని సీఐ హనుమంత నాయక్ హెచ్చరించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆహోబిలంలో సోమవారం సిబ్బందితో కలిసి పల్లెనిద్ర చేపట్టారు. ముందుగా గ్రామంలో పోలీసులతో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. పాత కక్షలు, చిన్న మనస్పర్థలు మనసులో పెట్టుకుని అవకాశం దొరికిందని చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎస్‌ఐ నరసింహులు ఉన్నారు.

వాహనాల తనిఖీ


చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చాగలమర్రి: మండల కేంద్రం సమీపంలోని 40వ నంబరు జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద పోలీసు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. సోమవారం ఎస్‌ఐ రమణయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు ఉన్నారు.

క్షుద్ర పూజల కలకలం


ప్రభుత్వ పాఠశాల సమీపంలోని పొలాల్లో క్షుద్ర పూజల దృశ్యం

రుద్రవరం: మండలంలోని ముత్తలూరు గ్రామంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో నాయుడు అనే రైతు పొలంలో ముగ్గులు వేసి అందులో బొమ్మ ఏర్పాటు చేసి ఆ బొమ్మకు మేకులు గుచ్చి నిమ్మ కాయలు ఉంచారు. ఉదయాన్నే రైతు పొలం వద్దకు వెళ్లగా క్షుద్రపూజలు చేసిన దృశ్యం కనిపించింది. విషయం కొద్దిసేపటికే గ్రామం అంతా పాకింది. ఇప్పటికే ఆ పొలం వైపు నాలుగుసార్లు క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉన్నాయని రైతు భయాందోళన వ్యక్తం చేశారు. కొంతకాలంగా ఇలా పూజలు చేస్తుండటంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, రైతులు, కూలీలు భయాందోళన చెందుతున్నారు.

సిద్ధం మహాసభను విజయవంతం చేయండి


సిద్ధం పోస్టర్లను విడుదల చేస్తున్న శశికళారెడ్డి

నంద్యాల: ఈనెలలో అనంతపురంలో జరిగే సిద్ధం మహాసభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళా రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు బెక్కెం శకుంతలమ్మ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బొమ్మలసత్రంలోనున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలోని మహిళా లోకమంతా రానున్న ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అందరికీ మంచి చేస్తున్న జగనన్నను మరోసారి గెలిపించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో నంద్యాల జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు విజయ, జనరల్ సెక్రటరీ షేక్ షాజహాన్, షేక్ షాకున్ బీ, సెక్రటరీ సుబ్బమ్మ, సూర్యలత, జాయింట్ సెక్రటరీ లక్ష్మి, లక్ష్మీదేవి, సర్పంచ్ రత్నమ్మ, రాజమ్మ, సుధాజ్యోతి పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

శిరివెళ్ల: చోరీ చేసి పారిపోతున్న దొంగను పట్టుకున్న ఘటన సోమవారం వెంకటాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..ఆంజనేయస్వామి ఆలయం పక్కనున్న మంకన్న ఇంట్లో వారు తాళం వేసి పనులకు వెళ్లారు. ఇంటి యజమాని కుమారుడు రామాంజనేయుడు పని నుంచి ఇంటి సమీపంలోకి రాగా తలుపులు తెరిచి ఉండం చూసి ఏదో జరిగిందని లోపలికి వెళ్లబోతుండగా ఇంట్లో నుంచి దొంగ బయటకు వచ్చాడు. దొంగలు పడ్డారని కేకలు వేయడంతో ఒక దొంగ బైక్‌పై పారిపోగా, ఇంకో దొంగ ఇంటి వెనుక వైపునున్న పొలాల్లోకి పరుగులు తీశాడు. గ్రామస్తులు వెంబడించి పట్టుకొని జేబులోనున్న 2 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.16 వేల నగదును లాక్కుని పోలీసులకు అప్పజెప్పారు. బీరువాను పగల గొట్టి చోరీ చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టుబడిన వ్యక్తిది బనగానపల్లె ప్రాంతమని, మరో దొంగ ఆచూకీ తెలియాల్సి ఉందని, విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

చిరువ్యాపారులకు ప్రభుత్వ అండ

- పన్ను మినహాయింపుపై అనుచిత కథనాలు సరికాదు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలో చిరు వ్యాపారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా పేర్కొన్నారు. చిరువ్యాపారులకు గేట్ పన్ను విధిస్తున్నారని కొన్ని పత్రికలు కథనాలు రాయడంపై తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నంద్యాలలో చిరు వ్యాపారులకు భారంగా మారిన గేట్ పన్నును మినహాయిస్తూ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. అయితే ఆ మినహాయింపుపై జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆమోదం పొందడానికి గెజిట్‌ను అయన ముందుంచుతామన్నారు. ఆయన ఆమోదం తరువాతే పన్ను మినహాయింపు అమలులోకి వస్తుందన్నారు. కౌన్సిల్ నిర్ణయాన్ని అమలు చేయకుండా ఎందుకు గేట్ వసూలు చేస్తున్నారని కొన్ని పత్రికల్లో కథనాలు రావడం సరికాదన్నారు. నిర్ణయాన్ని ప్రకటించామని, ఆ క్షణమే అది అమలులోకి రాదని, అధికారిక ప్రక్రియ పూర్తయిన తరువాతే అమలవుతుందని చెప్పారు. అనవసరంగా గేట్ వసూలుపై కొందరు రాజకీయం చేయడం తగదన్నారు. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి పన్ను వసూలు పూర్తిగా రద్దు చేయబడతాయని స్పష్టం చేశారు.చిరువ్యాపారులు ఆందోళన చెందాల్సిన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. చిరువ్యాపారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆకుమళ్ల రహీం, సత్యనారాయణ ఉన్నారు.

ఎస్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో 77వ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా బాలగంగిరెడ్డి వ్యవహరించారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా డి.మౌలాలి, ప్రధాన కార్యదర్శిగా అజామ్‌బేగ్, ఆర్థిక కార్యదర్శిగా శివప్రసాద్, వెంకటరామిరెడ్డి, జీవీఎస్ ప్రసాదరెడ్డిలతో పాటు రాష్ట్ర కౌన్సిలర్లుగా నరసింహరావు, వెంకటేశ్వరరెడ్డి, ప్రసాదరావు, జిల్లా సంయుక్త అధ్యక్షులుగా సుబ్బారెడ్డి, శివలక్ష్మి, మల్లేశ్వరి, రాజశేఖర్‌తో పాటు ఉపాధ్యక్షులుగా సుబ్బయ్య, అదనపు కార్యదర్శులుగా ఉస్మాన్, శాంతకుమారి, పార్వతిని ఎన్నుకున్నట్లు బాలగంగిరెడ్డి తెలిపారు.